


# సినిమా న్యూస్



## సంక్రాంతి బరిలో 'కొక్కోరోకో'!

విలక్షణమైన నటనతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ చెరగని ముద్ర వేసిన నటుడు సముద్రఖని. ఇటీవల 'ది రాజాసాబ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు 'కొక్కోరోకో' అనే ఆసక్తికరమైన చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో యంగ్ నటి మనస్విని బాలబొమ్మల కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత, తన నూతన బ్యానర్ ఆర్వీ ఫిల్మ్ హౌస్ స్థాపించి తొలిసారి నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటం విశేషం. శ్రీనివాస్ వసంతల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా, నిర్మాత రమేష్ వర్మ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 7న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో పాటు రెండు కోళ్లు పందెంలో తీవ్రంగా పోరాడుతున్న ఆకట్టుకునే పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. కోడిపందేల నేపథ్యంతో ఐదు విభిన్న పాత్రల చుట్టూ సాగే ఈ ఆంథాలజీ చిత్రం, పండుగ వాతావరణానికి తగినట్టుగా ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం స్పష్టం చేసింది. నీలాద్రి ప్రొడక్షన్స్ భాగస్వామ్యంతో వస్తున్న ఈ సినిమా సంక్రాంతి రేసులో మంచి విజయాన్ని సాధిస్తుందా? లేక పెద్ద సినిమాలతో పోటీపడి బరిలో ఓడిపోతుందా? అని నెటిజన్లలో ఆసక్తి నెలకొంది.




## మెగాస్టార్ బర్త్‌డే గిఫ్ట్!

బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో సంచలన విజయం సాధించిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతోంది. ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేథా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ 'మెగా-158' నుంచి మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బిగ్ అప్‌డేట్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా (ఆగస్ట్ 22న) వచ్చేసింది. ఈ సినిమాకు 'కాకా' అనే వింటేజ్ అండ్ పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ గ్రాండ్‌గా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ థమన్ ఎనర్జిటిక్ సంగీతాన్ని అందిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్ విషయానికి వెళితే.. ఆక్వా రంగానికి చెందిన 'కె. సత్యం' అనే సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఎంట్రీ ఇచ్చే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది.

చెన్నై టీమ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ లోడ్ సకాలంలో చేరుతుందని భరోసా ఇవ్వడం, పండుగ టార్గెట్ పేరుతో సునీల్ అడిగిన లీవ్ తిరస్కరించడం లాంటి నేచురల్ సీన్స్‌తో కథపై ఆసక్తి పెరుగుతుంది. గెటప్ శ్రీను విసిరిన స్కూటర్ కీస్ నీటిలో పడిపోగా, ఓ కుక్క తెచ్చిన రిమోట్ మాగ్నెట్ సాయంతో వాటిని తీసే క్రమంలో లోపలి నుంచి తుపాకులు బయటపడడం ఊహించని ట్విస్ట్ ఇస్తుంది. కళ్లద్దాలతో నడివయస్కుడైన శాంతమూర్తిగా కనిపిస్తూనే, ఆ వెంటనే 'కాకా' టైటిల్ రివీల్ కావడం మాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఆ తర్వాత వచ్చే పవర్‌ఫుల్ ఫ్లాష్ బ్యాక్‌లో యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ మెగాస్టార్ ఇచ్చిన వింటేజ్ మాస్ పోజ్ థియేటర్లను ఊపేసేలా ఉంది. ఇక తమన్ అందించిన బ్యాక్‌గ్రౌంట్ స్కోర్ గ్లింప్స్‌కి హైలెట్‌గా నిలిచింది. కాగా.. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.




## తమన్నా మూవీ వాయిదా




సెకండ్స్ ఇన్నింగ్స్‌లోను ఫుల్ జోష్‌లో ఉన్న మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా నటిస్తున్న చిత్రాల్లో 'వ్వన్-ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' ఒకటి. జానపద థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి అరుణాభ్ కుమార్, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటిస్తున్నాడు. బాలాజీ మోషన్ పిక్చర్స్ అండ్ ది వైరల్ ఫీవర్ (టీవీఎఫ్) సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది మే 15న రిలీజ్ కావాల్సి ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25కు వాయిదా వేస్తున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించిన విషయం తెలిసిందే.

కానీ ఇప్పుడు ఈ తేదీకి కూడా సినిమా రావడం లేదని క్లారిటీ వచ్చింది. ఫిలిమ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. 'VVAN' చిత్రానికి సంబంధించి తెర వెనుక తీవ్రమైన సృజనాత్మక విభేదాలు తలెత్తడంతో, ఈ సినిమాను భారీ స్థాయిలో రీ-షూట్, రీ-ఎడిట్ చేయాలని నిర్ణయించారట. ఈ ప్రాజెక్ట్ నుండి ఎడిటింగ్ బృందాన్ని తొలగించగా, అసలు సృష్టికర్తలైన టీవీఎఫ్, దర్శకుడు దీపక్ మిశ్రా కూడా దీని నుండి తప్పుకున్నారు. దీని తర్వాత, మిగిలిన నిర్మాణ, ఎడిటింగ్ పనులను పర్యవేక్షించే బాధ్యతను నీరజ్ కొఠారి, సాహిర్ రజా చేపట్టారు. అలాగే, సినిమాను పూర్తి చేయడానికి సిద్ధార్థ్ మల్హోత్రా మరో 17 రోజుల పాటు రీ-షూట్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. దీంతో ఈ చిత్రం మొదట అనుకున్న విడుదల తేదీ అయిన సెప్టెంబర్ 25న విడుదల కావడం లేదని స్పష్టమైంది.

## కర్ణుడి కథ

### సరికొత్త టెక్నాలజీ!

మహాభారతంలో అత్యంత శక్తివంతమైన యోధుడు కర్ణుడి కథతో ఓ భారీ ప్రాజెక్ట్ రాబోతున్నట్లు అధికారిక ప్రకటన విడుదలైంది. రమేష్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మహావీర్ కర్ణ' సినిమాకి సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ప్రముఖ నిర్మాత జయంతిలాల్ గడ పెన్ మూవీస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్, ఆర్వీ స్టూడియోస్ కలిసి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 4, 2026న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ ఉపయోగించని హైబ్రిడ్ లైవ్-యాక్షన్ అనే కొత్త గ్రాఫిక్స్ సాంకేతికతతో ఈ సినిమా రాబోతుండటం విశేషం. పాతకాలపు పురాణాల కథకు, ఇప్పటి ఆధునిక కంప్యూటర్ గ్రాఫిక్స్ జోడించి చాలా కొత్తగా చూపించనున్నారట.




కర్ణుడి దానగుణం, ఆయన ధైర్యం, దుర్యోధనుడితో ఉన్న గొప్ప స్నేహం, అలాగే యుద్ధంలో ఆయన పోరాడిన విధానం.. ఇలా ఆయన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలన్నింటినీ ఈ సినిమాలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ టీజర్ రాగానే సోషల్ మీడియాలో కర్ణుడి పాత్రపై పెద్ద చర్చ మొదలైంది. కొందరు కర్ణుడి త్యాగాన్ని, స్నేహాన్ని పొగుడుతుంటే, మరికొందరు యుద్ధంలో ఆయన చేసిన పొరపాట్లను గుర్తుచేస్తున్నారు. ఏది ఏమైనా, ఈ పాత్రను దర్శకుడు ఎలా చూపిస్తారో అనే ఆసక్తి అందరిలో పెరిగింది. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు ఒక మంచి విజువల్ అనుభూతిని ఇస్తుందని సినీ ప్రియులు భావిస్తున్నారు.




## కోలీవుడ్‌కు బిగ్ బ్రేక్!

థియేటర్ - ఓటీటీ విండో వివాదం కారణంగా తమిళ సినీ పరిశ్రమ (కోలీవుడ్)లో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి కొత్త తమిళ సినిమాల విడుదలతో పాటు, షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తిగా నిలిపివేయాలని 'తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్', 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' సంచలన నిర్ణయం తీసుకున్నాయి.

అసలు వివాదం ఏమిటంటే?

సినిమాను థియేటర్లలో విడుదల చేసిన 8 వారాల తర్వాత మాత్రమే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోకి తీసుకురావాలన్నది థియేటర్ యాజమాన్యాల డిమాండ్. ఈ మేరకు లిఖితపూర్వక హామీ ఇచ్చిన నిర్మాతల సినిమాలను మాత్రమే థియేటర్లలో ఆడిస్తామని 'తమిళనాడు థియేటర్ ఓనర్స్ అసోసియేషన్', 'డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్' ప్రకటించాయి. స్టేక్ హోల్డర్స్‌తో చర్చించకుండా థియేటర్ యాజమాన్యాలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని నిర్మాతలు తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళలో ఇలాంటి నిబంధన ఎక్కడా లేదని, కేవలం తమిళనాడులోనే ఉద్దేశపూర్వకంగా దీన్ని తీసుకురావడాన్ని తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కనుగొంటామని తెలిపారు.